
జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, కార్పొరేటర్ విజయారెడ్డి, చిన్నశ్రీశైలం యాదవ్


ఫిలింనగర్‌లో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్


మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యదేవరాజన్

# పూలేను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

**బంజారాహిల్స్/బేగంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** జ్యోతిరావు పూలే ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫిలిం నగర్ మహనీయుల చౌరస్తాలో జ్యోతిరావు పూలే వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, కార్పొరేటర్ వి.విజయారెడ్డి, మహాత్మా జ్యోతిరావు పూలే ఉత్సవ కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్ తదితరులు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చేయూతనందించేందుకు పూలే నిరంతరం కృషి చేశారనాన్నరు. పూలే విగ్రహానికి బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తదితరులు నివాళులర్పించారు.


పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు కాటూరి రమేష్, శ్యామ్, ఎల్లయ్య


సమావేశంలో మాట్లాడుతున్న నీలిమ

## హౌసింగ్‌బోర్డు స్థలం కబ్జాపై అధికారులతో మాట్లాడతా

● సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ

**బేగంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** హౌసింగ్ బోర్డు స్థలం కబ్జాపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ హామీ ఇచ్చారు. శుక్రవారం అమీర్‌పేట డివిజన్‌లోని బాపునగర్‌లో పలు శాఖల అధికారులతో ఆమె పర్యటించారు. హౌసింగ్ బోర్డు స్థలం కబ్జాకు గురైందని, సేవాలాల్ మందిరం నిర్మించాలని, పార్కుకు స్థలం కేటాయించేలా చూడాలని స్థానికులు ఆమెను కోరారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## లింగబలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాచప్ప


రాచప్ప

**ఖైరతాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖైరతాబాద్‌కు చెందిన కల్లపల్లి రాచప్ప నియమితులయ్యారు. సంఘం గౌరవాధ్యక్షులు పట్లోళ్ల సంగమేశ్వర్, సీనియర్ నేత వెన్న ఈశ్వరప్ప నేతృత్వంలో శుక్రవారం జరిగిన సమావేశంలో రాచప్పను ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు అధ్యక్షుడు దినేష్ పాటిల్ తెలిపారు. కోశాధికారిగా శివచరణ్, క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా శెట్టి శివకుమార్, యువజన అధ్యక్షుడిగా భరత్‌ను ఎన్నుకున్నారు.



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

## నేవీ కార్యాలయంలో రక్తదాన శిబిరం

**అమీర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ నేవీ కార్యాలయంలో శుక్రవారం వీకేర్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మ్యాగ్నిష్ డయాగ్నస్టిక్స్, ఇండియన్ రెడ్ క్రాస్ సంయుక్తంగా డీఎండీఏ సికింద్రాబాద్ నేవీ కార్యాలయంలో రక్తదానం, ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 150 మందికి పైగా నేవీ అధికారులకు వైద్య పరీక్షలు చేశామని డయాగ్నస్టిక్ నిర్వాహకుడు సింగం శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా నేవీ అధికారి శ్రీనివాసులు, డాక్టర్ రాహుల్ సింగర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ నటరాజన్‌ను డీఎండీఏ నేవీ డైరెక్టర్ అశ్విన్ కుమార్ సన్మానించారు.

## మురుగు, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు


జలమండలి సిబ్బందికి సూచనలు ఇస్తున్న కార్పొరేటర్ దేదీప్య

**పంజాగుట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** బస్తీలు, కాలనీల్లో మురుగు, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యవిజయ్ అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు జలమండలి మేనేజర్ రాజేందర్, సిబ్బందితో కలిసి రహ్మత్‌నగర్, యాదగిరినగర్, జవహర్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న శేషుకుమారి

## దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

**అమీర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** నేడు తెలంగాణ భవన్‌లో నిర్వహించ తలపెట్టిన దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ శేషుకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రసాధన ఉద్యమాన్ని మలుపుతిప్పిన అరుదైన ఘట్టం దీక్ష దివస్ అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, శ్రీనివాస్, లక్ష్మి, నాగలక్ష్మి, రాణికౌర్, నరేష్ పాల్గొన్నారు.

## నకిలీ వైద్యుడి అరెస్ట్

**యూసుఫ్‌గూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** నకిలీ వైద్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా రామకృష్ణ కొంతకాలం పనిచేశారు. అనంతరం బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో సాయి జనార్దన్ క్లినిక్‌ను ప్రారంభించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గురువారం క్లినిక్‌పై దాడి చేశారు. రామకృష్ణ అందుబాటులో లేకపోవడంతో అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం కేసు నమోదు చేశారు.

## ఐఏఎస్ పేరుతో మోసం

**యూసుఫ్‌గూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** తాను ఐఏఎస్ అని, ఐటీ కంపెనీలు ఉన్నాయని ఓ వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనగర్ కాలనీకి చెందిన పి. శ్యాంప్రసాద్ 2014 నుంచి ఆడిట్ కార్యాలయంలో అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆడిట్ కోసం ఈ కార్యాలయానికి వస్తున్న టి.సిద్దు బత్తుల శశికాంత్ ఐఏఎస్ అధికారి అని శ్యాంప్రసాద్‌కు పరిచయం చేశాడు. శశికాంత్ కొంతకాలం తర్వాత తనకు వివిధ రకాల కంపెనీలు ఉన్నాయని, వాటిలో ఐటీ ఉద్యోగం ఇస్తానని శ్యాంప్రసాద్‌ను నమ్మించాడు. కొంతకాలం తర్వాత అత్యవసరం ఉందని చెప్పి శ్యాంప్రసాద్ నుంచి డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత ఫిలింనగర్ పోలీసులు శశికాంత్‌ను అరెస్టు చేసినట్లు వివిధ పత్రిల్లో శ్యాంప్రసాద్ చూశాడు. మోసపోయానని గ్రహించి శుక్రవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆటోడ్రైవర్

**అమీర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** తెల్లవారుతుండగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆటోడ్రైవర్‌ను అరెస్ట్ చేసిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రాజురాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరుకు చెందిన యువతి(24) సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ధరమ్‌కరమ్ రోడ్డులో నివాసం ఉంటోంది. ఈనెల 24న గుంటూరు నుంచి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరింది. అమీర్‌పేట మైత్రివనం చౌరస్తాలో ఉదయం 4-30 గంటలకు దిగి సత్యం టాకీస్ వైపు నడుచుకుంటూ వెళ్తోంది. గమనించిన మాసబ్ ట్యాంక్ బోలానగర్ కాలనీ ఖాజానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ నజీర్(24) వెంబడించి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో సదరు యువతి కేకలు వేసింది. గమనించిన భిక్షాటన చేసుకునే వారు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయాడు. ఇదే రోజు యువతి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా ఖాజానగర్‌లో ఉంటున్న నజీర్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# ప్రజలకు నష్టం చేసే పనులు అంగీకరించం

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


పాటిగడ్డ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ప్రజలకు నష్టం చేసే పనులు చేపడితే అంగీకరించేది లేదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డలో పలు శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ ప్రాంతంలో నూతనంగా చేపడుతున్న ఫ్లైఓవర్ కోసం తమ ఇళ్లకు నోటీసులు ఇచ్చారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నామని, ఇప్పుడు ఖాళీ చేయమంటే ఎటు వెళ్లాలో అర్థం కావడం లేదని ఎమ్మెల్యేతో చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అధికారులు ప్రతిపాదించిన మార్గంలో హెరిటేజ్ భవనాలు కూడా ఉన్నాయని, వాటిని కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నష్టం జరగకుండా ఫ్లైఓవర్ నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అక్కడ ఉన్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. ఫ్లోరింగ్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. లిఫ్ట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ టి. మహేశ్వరి, డిప్యూటీ కమిషనర్ ధాకునాయక్, ఈఈ సుబ్రమణ్యం, వాటర్ వర్క్స్ జీఎం వినోద్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, నరేందర్‌రావు, శేఖర్ ముదిరాజ్, అక్బర్, అఖిల్ పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తులను ఉమీద్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి



ఉమీద్ పోర్టల్‌పై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

**బోరబండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** వక్ఫ్ బోర్డు ద్వారా గుర్తింపు పొందని ఆస్తులను ఉమీద్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని బోర్డు సిబ్బంది, న్యాయవాదులు సూచించారు. ఈ పోర్టల్‌లో ఆస్తుల నమోదుతో రక్షణ కలుగుతుందని తెలిపారు. బోరబండ సైట్-3 కాలనీ ఇబ్రహీం గుల్షనీ మసీదులో ఉమీద్ వక్ఫ్ పోర్టల్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది అఫ్జలుద్దీన్ దక్కనీ మాట్లాడుతూ ఇప్పటి వరకు వక్ఫ్‌బోర్డు గుర్తింపు పొందని మసీదులు, మదర్సాలు, కబరస్తాన్‌లు, దర్గాలు, చిల్లాల వివరాలను వెంటనే ఉమీద్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త వక్ఫ్ చట్టం ప్రకారం ఉమీద్ పోర్టల్‌లో నమోదు కాని వాటికి వక్ఫ్ ఆస్తులుగా గుర్తింపు ఉండదన్నారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ వ్యక్తిగత సహాయకుడు అంజద్, ఐటీ విభాగం సిబ్బంది ఇంతియాజ్, న్యాయవాది ఎం.డి.హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అబ్దుల్ సలాం, షేక్ ఫయాజ్, ఎం.డి.నజీర్, ఫైజాన్, వివిధ మసీదులు, మదర్సాలు, కబరస్తాన్, చిల్లా కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శస్త్ర చికిత్సలు చేయడంలో జాగ్రత్తగా వ్యవహరించాలి



సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలు

**హైదరాబాద్ సిటీ/ రాజేంద్రనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** శస్త్ర చికిత్సలు చేయడంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డా.జ్ఞానప్రకాశ్ వైద్యులకు సూచించారు. రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, రెనోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ సంయుక్తంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న మైక్రో వాస్క్యులర్, ఎండో వాస్క్యులర్‌పై శిక్షణ కార్యక్రమం శుక్రవారం రాజేంద్రనగర్ పశువైద్య కళాశాలలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డా.జ్ఞానప్రకాశ్ ప్రారంభించారు. జంతు కణజాలం, హై ఫిడిలిటీ మోడల్స్‌ను ఉపయోగించి వెస్సెల్ అనస్థమోసిస్ ఎలా చేయాలో శిక్షణలో తెలియజేశారు. లైవ్ యానిమల్ ఆపరేటివ్ ట్రైనింగ్‌లో భాగంగా ఎండోవాస్క్యులార్ సిమ్యులేషన్‌లపై సదస్సులో ప్రసంగించారు. శస్త్ర చికిత్స ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, బహుళ విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలను, డాక్టర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ ఐ దినకర్, రెనోవా గ్రూప్ హాస్పిటల్స్ సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి, డాక్టర్ కేవీఆర్ శాస్త్రి, డా.బీసీఎం ప్రసాద్, డాక్టర్ ఉదయ్‌కుమార్, డా.స్వాతి, డా.సయ్యద్ అమీర్ బాషా పస్పాలా, డా.టీవీ రామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

**పంజాగుట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, మూఢవిశ్వాసాలను విడనాడాలని ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. జన విజ్ఞాన వేదిక(జేవీవీ) హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముఖి సైన్స్ సంబరాలు శుక్రవారం శ్రీనివాస నగర్ వెస్ట్ కమ్యూనిటీ హాల్‌లో జరిగాయి. సమాజం అభివృద్ధి సాధించడంలో సైన్స్ పాత్ర అజరామరమని జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా అన్నారు. సీసీఎంబీ రీసెర్చ్ స్కాలర్ ఆదిత్య ఉండ్రే, జేవీవీ రాష్ట్ర నాయకుడు చంద్రయ్య మాట్లాడుతూ ప్రశ్న సమాజ గతిని మారుస్తోందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాలల విభాగం అవార్డు గ్రహీత వెంకటరమణ కథలు, సైన్స్, మూఢవిశ్వాసాలు అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి చెకుముఖి సంబరాలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎం.భరత్, ఎం.రవీంద్రబాబు, నాయకులు లింగస్వామి, ఎన్.శ్రీనివాస్, వి.రాహుల్, కె.సూర్యనారాయణ, శాంతి, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, సీహెచ్.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ నిహిత్ జైస్వాల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సునీత ఉప్పె

## వరల్డ్ ఉమెన్ లీడర్‌షిప్ కాంగ్రెస్ అవార్డులు

**బంజారాహిల్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** వ్యాపార, వాణిజ్య రంగంలో నూతన ఆవిష్కరణలతో రాణిస్తున్న మహిళలను ప్రోత్సహించేందుకు వరల్డ్ సీఎస్ఆర్ డే సందర్భంగా ఉమెన్ లీడర్ షిప్ కాంగ్రెస్ అవార్డులు పంపిణీ చేసింది. బంజారాహిల్స్‌లో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో పూణెకు చెందిన ఇందిరా విశ్వవిద్యాలయం డైరెక్టర్ నిహిత్ జైస్వాల్ ప్రత్యేక అతిథిగా హాజరై పలువురికి అవార్డుల ప్రదానోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వారిని ప్రోత్సహించేందుకు ఈ అవార్డులు అందజేస్తున్నట్టు చెప్పారు. అవార్డు అందుకున్న వారిలో రాష్ట్రానికి చెందిన రాఘవేంద్ర హోటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీత ఉప్పా తదితరులు ఉన్నారు.

## దొంగ పోలీస్..!

● నకిలీ ఐఏఎస్ ఇంట్లో రోలెక్స్ వాచ్ కొట్టేసిన కానిస్టేబుల్

● అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**బంజారాహిల్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** నకిలీ ఐఏఎస్ గా అనేక మందిని బురిడీ కొట్టించాడు ఓ వ్యక్తి. అతడి ఇంట్లో శోధనకు వెళ్లిన ఓ కానిస్టేబుల్ ఏకంగా చోరీకి పాల్పడి కటకటాల పాలయ్యాడు. ఐఏఎస్ అధికారిని అని నమ్మించి ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అనేక మందిని మోసం చేశాడు. ఫిర్యాదులు రావడంతో రంగంలోకి దిగిన పోలీసులు నకిలీ అధికారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా.. నకిలీ ఐఏఎస్ ఇంట్లో ఈనెల 25వ తేదీన పోలీసులు తనిఖీ కోసం వెళ్లారు. అధికారులతోపాటు కానిస్టేబుల్ బత్తిని శశికాంత్ కూడా వెళ్లాడు. వీడియో రికార్డు చేస్తోన్న శశికాంత్ కన్ను ఇంట్లో ఉన్న ఇమిటేషన్ రోలెక్స్ వాచీపై పడింది. అధికారుల కళ్లు కప్పి వాచ్‌ను దొంగిలించాడు. పంచనామాలో చేతి గడియారం వివరాలు నమోదు చేయలేదు. ఈ విషయం మరో కానిస్టేబుల్ వీడియో రికార్డింగ్‌లో బయటపడింది. వెంటనే పోలీసులు శశికాంత్‌ను ప్రశ్నించగా.. గడియారం దొంగిలించింది నిజమే అని ఒప్పు కున్నాడు. దీంతో ఫిలింనగర్ పోలీసులు కానిస్టేబుల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ

**ఖైరతాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని పలుచోట్ల చలికి వణుకుతున్న పేదలకు గురువారం రాత్రి దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్, నిర్వాహకురాలు వీణామాధురి, ప్రతినిధులు బాల్‌కుమార్, రాచప్ప, సతీష్, వినోద్ యాదవ్, సాయి, మంత్రి సచ్‌దేవ్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడొద్దని ప్రచారం చేయాలి


పండ్ల వ్యాపారికి సంచిని అందజేస్తున్న కోటిరెడ్డి

**ఎర్రగడ్డ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ప్లాస్టిక్ వాడొద్దని యువత ప్రచారం చేయాలని లయన్స్ క్లబ్ పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎర్రగడ్డ, బాలానగర్, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో పండ్ల వ్యాపారులకు క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు.

## హనుమాన్ ఆలయ ఆదాయం రూ. 5,74,169


హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

**అమీర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** అమీర్‌పేట హనుమాన్ ఆలయం హుండీలను శుక్రవారం లెక్కించారు. నాలుగు నెలలకు సంబంధించి 10 హుండీల ద్వారా రూ.5,74,169 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జయంతి తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 5 గంటలకు ముగిసింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సత్యనారాయణ యాదవ్, ధర్మకర్తలు శ్రీశైలంగౌడ్, ముదిగొండ శ్రీనివాస్, శోభబాయ్, దేవీబాయ్, హరిశంకర్‌గౌడ్, శ్రీధర్‌శర్మ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**పంజాగుట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ విశ్వభారతి, సాయి ఎన్‌క్లేవ్ ఫీడర్ల పరిధి, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11 కేవీ కుమ్మరిబస్తీ ఫీడర్ పరిధి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ హైటెక్ థియేటర్, ఉద్యోగ్ నగర్, హైలం కాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

### గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ ఎన్‌బీటీ నగర్ ఫీడర్ పరిధి, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ శ్రీముఖి, భారత్ నగర్, బీఎస్ పురి ఫీడర్ల పరిధి, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ మూసాపేట్ హెచ్‌పీ రోడ్ ఫీడర్ పరిధి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ దుర్గానగర్, నెహ్రూపార్క్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

## అపార్ట్‌మెంట్ పై నుంచి పడి విద్యార్థిని మృతి


దీపిక చౌదరి

**బేగంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** అపార్ట్‌మెంట్ పదో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడిన బీటెక్ విద్యార్థిని మృతి చెందింది. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డలోని కల్పతరు అపార్ట్‌మెంట్స్‌లోని 10వ అంతస్తులో కిషోర్ చౌదరి నివసిస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె దీపిక చౌదరి(18) బౌరంపేటలోని కేఎల్ హైదరాబాద్ క్యాంపస్‌లో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. గురువారం రాత్రి దీపికచౌదరి పదో అంతస్తు నుంచి కిందపడడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. ఇంట్లోని బాత్‌రూమ్ కిటికీ నుంచి దీపిక చౌదరి ప్రమాదవశాత్తు కిందపడినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి మహాప్రభో..!

● ఆస్పత్రి ఎదుట ప్రయాణికుల అవస్థలు
● గతంలో గాంధీ విగ్రహం కోసం కూల్చివేత
● నేటికీ పునర్నిర్మాణానికి నోచని దుస్థితి
● గాంధీకి నిత్యం వందల మంది రాకపోకలు.. వారికి తప్పని తిప్పలు


బస్సుల కోసం వేచియున్న ప్రయాణికులు


ఈఎస్‌ఐ డైరెక్టరేట్ వద్ద ఉన్న బస్‌షెల్టర్ ఎదుట ఉన్న అంబులెన్స్‌లు


బస్సు ఎక్కటానికి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

**పద్మారావునగర్, నవంబరు28(ఆంధ్రజ్యోతి):** బస్ షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముషీరాబాద్ ప్రధాన దారిలో గల ప్రభుత్వ గాంధీ ఆసుపత్రి ఎదురుగా బస్ షెల్టర్ లేదు. దీంతో బస్సుల కోసం ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ నిరీక్షిస్తున్నారు. గాంధీ ఆసుపత్రికి నగరంలో నుంచే కాకుండా రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి కూడా చికిత్సల కోసం వందలాది మంది రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. నిరుపేదలు ఎక్కువ శాతం మంది బస్సులలోనే ప్రయాణం సాగిస్తుంటారు. ఆసుపత్రి సిబ్బంది సైతం అందులోనే వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ప్రాంతంలో వారి సౌకర్యార్థం బస్ షెల్టర్ ఏర్పాటు చేయక పోవడంపై దారుణమని పలువురు అంటున్నారు.

● గత ప్రభుత్వ హయాంలో గాంధీ ఆసుపత్రి ఎదుట మహాత్మా గాంధీ భారీ విగ్రహం ఏర్పాటు చేసి అక్కడున్న బస్ షెల్టర్‌ను తొలగించారు. ఇప్పటి వరకు దాన్ని ఏర్పాటు చేయడంలో ఆర్టీసీ, జీహెచ్ఎంసీ అధికారులు విఫలమయ్యారు.

● గాంధీ ఆసుపత్రి ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఈఎస్ఐ డైరెక్టరేట్ కార్యలయం వద్ద ఉన్న బస్‌స్టాప్.. పరిస్థితి మరోలా ఉంది. ఇక్కడున్న బస్ షెల్టర్‌లో ప్రైవేట్, అంబులెన్స్ వాహనాలకు, యాచకులకు అడ్డాగా మారింది. బస్‌స్టాప్‌లో కాకుండా ఆర్టీసీ బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆపుతున్నారు. ప్రయాణికులు అయోమయంలో పడేస్తున్నారు. ఈఎస్ఐ కార్యాలయ ప్రహరీ, మెట్రో పిల్లర్, అక్రమంగా ఆటోల పార్కింగ్ వల్ల రహదారి ఇరుకుగా మారింది. దీంతో ఈ ప్రాంతంలోనే బస్సులను నిలుపుతుండగా.. ప్రయాణికులు ఎక్కేందుకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా గాంధీ ఆసుపత్రి వద్ద బస్ షెల్టర్‌లు ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ వద్ద బస్ షెల్టర్‌ను శుభ్రపరచి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని, అక్రమ పార్కింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుకుంటున్నారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

## అమ్మవారికి విశేష అలంకరణ

● అడ్డగుట్ట శాస్త్రినగర్.. మహంకాళి అలయంలో అమ్మవారికి శుక్రవారం కుంకుమార్చన ఆతర్వాత ప్రత్యేక అలంకరణ గావించారు. ప్రత్యేక పూజలను పూజారి కృష్ణ నిర్వహించారు. భక్తులకు భారీ సంఖ్యలో తరలివచ్చారు.
**అడ్డగుట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :**


స్థానిక ప్రజలతో కలిసి బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదామల్లికార్జున్

## అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు

● కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్

**మారేడుపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు నాల్గో వార్డు మారేడుపల్లి పోలీస్ స్టేషన్ నుంచి పద్మశాలి కల్యాణ మండపం వరకు రూ. 60 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. రెండు రోజుల్లో ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. ఆతర్వాత మహీంద్రా హిల్స్‌కు సంబంధించిన రోడ్డు నిర్మాణ పనులను కంటోన్మెంట్ వ్యాప్తంగా దశల వారీగా రోడ్డు నిర్మాణ పనులు, మరమ్మతు పనులు చేపడుతామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన బోర్డు సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ కంటోన్మెంట్‌లోని మెయిన్ రోడ్లు అంతర్గత కాలనీ రోడ్లను పరిశీలించి వాటి దుస్థితి గురించి కంటోన్మెంట్ బోర్డు సీఈఓకు వివరించారన్నారు. కాగా మారేడుపల్లి ప్రధాన రోడ్డును బాగు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తున్న నేపథ్యంలో వాహనదారులను, స్థానికులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే నిర్మాణ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు విజయానంద్, రాజ్ మల్లేష్, శ్రవణ్, జగన్, రామకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.



## మద్యం షాపు ఏర్పాటు చేయొద్దు

● మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్ పరికి బస్తీలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని శుక్రవారం కార్పొరేటర్ కొంతెం దీపిక, బస్తీ వాసులు డిమాండ్ చేశారు. ఆమేరకు ఫ్లెక్సీని చేతబూని నిరసన ప్రదర్శన నిర్వహించారు.
**(రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి)**


కళాకారులు సాంస్కృతిక ప్రదర్శన

## అలరించిన కళా ప్రదర్శనలు

**అల్వాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవ్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. ఏడు రోజుల్లో లక్షమందికి పైగా సందర్శకులు వచ్చారని శుక్రవారం విలేకరుల సమావేశంలో రాష్ట్రపతి నిలయం ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ రజనీప్రియ వెల్లడించారు. భారతీయ కళామహోత్సవ్ మరో రెండు రోజులు నిర్వహించనున్నారు. రాజస్థాన్‌కు చెందిన కళాకారులు మషక్ వాయిద్యం, రావణ హట్టం, బహురూపియా, స్టిక్ వాకర్, కల్బెలియా నృత్యం, లాల్ అంగి, మయూర్ నృత్యం, సహరియా స్వాంగ్ భావయి వంటి కళాప్రదర్శనలు ప్రదర్శించారు.

## అయ్యప్ప మాలధారులకు అల్పాహారం

**సికింద్రాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):** అయ్యప్ప మాలధారుల సౌకర్యార్థం తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమాన్ని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ పరిశీలించారు. శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 41 రోజుల పాటు నిర్వహించనున్న అల్పాహార వితరణ శనివారం ఏడో రోజుకు చేరింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోపాటు జంటనగరాలకు చెందిన అయ్యప్ప మాలధారులకు అల్పాహార వితరణ రూపంలో సేవ చేసుకునే అవకాశం, దక్కినందుకు ఆనందంగా ఉందన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ మాట్లాడుతూ మండలం రోజులు కఠిన దీక్ష బూని, హరిహరుడికి పూజలు చేసే అయ్యప్ప మాలధారులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు.


హాజరైన విద్యార్థులు


మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

# విద్యార్థులు కలలు సాకారం చేసుకోవాలి

● కలెక్టర్ దాసరి హరిచందన

**తిరుమలగిరి నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ఉపాధ్యాయుల సహకారంతో కలలు సాకారం చేసుకోవాలని కలెక్టర్ దాసరి హరిచందన చెప్పారు. 2047 అభివృద్ధి లక్ష్యంగా నేటి విద్యార్థులు ముందడుగు వేయాలన్నారు. హైదరాబాద్ జిల్లాలోని 24 మండలాల్లోని 183 ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం యూత్ పార్లమెంటు 2025 కార్యక్రమాన్ని బాలుర ఉన్నత పాఠశాల తిరుమలగిరిలో ఆమె ప్రారంభించారు. ప్రతి విద్యార్థి 2047 అభివృద్ధి లక్ష్యంగా చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. పుస్తకాలు చదవడం కాకుండా ప్రతి విషయాన్ని నేర్చుకోవాలని చెప్పారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని 2047 వరకు మీరంతా యువకులుగా తెలంగాణ అభివృద్ధిని నిర్దేశిస్తారని ఆశిస్తున్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల విశ్లేషణాత్మక విజ్ఞానాన్ని సముపార్జించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు కలుగుతాయన్నారు. ప్రతీ విద్యార్థి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు వేదికవుతాయని ప్రశంసించారు. ప్రతీ విద్యార్థి ఇలాంటి కార్యక్రమాల వల్ల భావవ్యక్తీకరణ సామర్థ్యాన్ని అలవర్చుకుంటారన్నారు. ఐ విజన్ యూత్ పార్లమెంట్ 2025లో భాగంగా మోడల్ యునైటెడ్ నేషన్స్, యూత్ పార్లమెంటు, తెలంగాణ యూత్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సమావేశంలో 11 దేశాల ప్రతినిధులుగా 8,9 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. యూత్ పార్లమెంటులో అంశాలపై చర్చించి పరిష్కార మార్గాలు సూచించారు. కార్యక్రమంలో ఇక్షణ ఫౌండేషన్ మార్కెటింగ్ అధినేత అంజలి గుప్తా, తిరుమలగిరి మండలం తహసీల్దార్ భిక్షపతి, హెచ్ ఎం భరద్వాజ్, టీచర్స్ పాల్గొన్నారు.

# బోయినపల్లి మార్కెట్ అభివృద్ధికి ప్రాధాన్యం

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్


బోయినపల్లి మార్కెట్ యార్డ్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, చైర్మన్ ఆనంద్ బాబు

**బోయినపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** బోయినపల్లి మార్కెట్‌లో గత కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించినట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను స్వయంగా తెలుసుకునే ఉద్దేశంతో శుక్రవారం ఉదయం మార్కెట్ యార్డును సందర్శించారు. రైతులు, వ్యాపారులు, హమాలీలతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ యార్డు కార్యాలయంలో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారస్తులు, ఫిర్యాదుదారులతో పాటు, మార్కెట్ యార్డు అధికారి వెంకన్న, చైర్మన్ ఆనంద్ బాబులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. రైతులు, హమాలీలు, కమీషన్ ఏజెంట్లు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఉపయోగం లేని టాయిలెట్లను తొలగించి నూతనంగా నిర్మించాలన్నారు. మార్కెట్‌లో రహదారులు పాడై పోయినందున రహదారులను అభివృద్ధి చేయాలన్నారు. మార్కెట్‌ను రోజూ క్లీనింగ్ చేయించాలన్నారు. వ్యాపారులు కూడా లైసెన్సుల విషయంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మార్కెట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. దాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం దక్కిందన్నారు. అవసరమైతే ఆ శాఖా మంత్రి మంత్రిని కలుద్దామన్నారు. ఆయన వెంట మార్కెట్ యార్డు పాలకమండలి సభ్యుల సాయి శరత్, రాజేందర్, ప్రభాకర్, ఆకాష్ రెడ్డి, కృష్ణా రెడ్డి, అమీర్ అస్లాం, జూలియర్స్, కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాలరాజ్ యాదవ్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌ఓసీ అందజేత

**మారేడుపల్లి:** మారేడ్‌పల్లి ప్రాంతానికి చెందిన అభిలాష్ కుటుంబానికి శుక్రవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. ఇటీవల బియ్యపులు మల్లప్ప కుమారుడు అభిలాష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స ఖర్చుల కోసం కంటోన్మెంట్ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రభుత్వానికి సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేశాడు. ఆ మేరకు మంజూరైన రూ.1.50 లక్షలకు గాను ఎల్‌ఓసీ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

### నా భర్త ఆత్మహత్యాయత్నానికి చైర్మన్‌కు సంబంధం లేదు: మహేందర్‌రెడ్డి సతీమణి

ఇటీవల లైసెన్స్ విషయంలో ఆత్మహత్యాయత్నం చేసిన మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. తన భర్త ఆత్మహత్యాయత్నానికి, చైర్మన్ ఆనంద్ బాబు ప్రమేయం లేదని, వేరే వాళ్ల వేధింపుల కారణంగానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, తమకు న్యాయం చేయాలని బాధితుడి భార్య విజ్ఞప్తి చేశారు.

## దీక్షా దివస్‌కు తరలిరండి

● కార్యకర్తలకు ఎమ్మెల్యే పద్మారావు పిలుపు


సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు, కార్పొరేటర్లు

**బౌద్ధనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ తన ప్రాణాలను లెక్కచేయకుండా చేపట్టిన దీక్ష చేపట్టిన రోజున దీక్షా దివస్‌గా నిర్వహిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు తెలిపారు. శుక్రవారం సీతాఫల్‌మండిలో ఉన్న క్యాంప్ కార్యాయలయంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కార్పొరేటర్ల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. శనివారం సికింద్రాబాద్ నుంచి తెలంగాణ భవన్‌కు భారీగా కార్యకర్తలు తరలిరావాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కార్యకర్తలు అభిమానుల్ని కోరారు. ముందుగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 6 లక్షలు విలువైన ఎల్‌ఓసీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్నలక్ష్మి రాసూరి సునిత, కింది శైలజ , సమన్వయ కర్త రాజు సుందర్‌లు పాల్గొన్నారు.

## ఓయూలో అధ్యాపకుల నిరసన


నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

**ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ప్రమోషన్లలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా ఔటా ఆధ్వర్యంలో అధ్యాపకులు సైన్స్ కళాశాల ఎదుట శుక్రవారం మధ్యాహ్నం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రమోషన్ నిరాకరించడం దారుణమన్నారు. ప్రమోషన్లపై నిజనిర్ధారణ కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్, అధ్యాపకులు కమలాకర్, రామచందర్, డా.వెంకటాదాస్, డా.వెంకటేశ్వరరావు, డా.లోఖండే, మాధురి, అరవింద్, సుజాత, శశికళ, రామకృష్ణగౌడ్, రాకేశ్బాబు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో వాచ్‌మన్‌కు జీవిత ఖైదు

**అడ్డగుట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** బాలికపై లైంగిక దాడి కేసులో వాచ్‌మన్‌కు నాంపల్లి కోర్టు జీవిత ఖైదు విధించింది. కార్ఖాన పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 డిసెంబరులో ఓ పార్క్‌కు వచ్చిన తొమ్మిదేళ్ల బాలికపై వాచ్‌మన్ గౌతమ్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై అప్పట్లో తల్లిదండ్రులు కార్ఖాన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదైంది. వివిధ కోణాల్లో పోలీసులు పూర్తిగా దర్యాప్తు చేశారు. శుక్రవారం కేసు తుది విచారణకు రాగా నిందితుడికి జీవితఖైదును విధిస్తూ నాంపల్లి 12వ అదనపు జడ్జి టి. అనిత తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.


జ్యోతిరావుపూలే వర్ధంతిలో జంపన తదితరులు

## జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి

**సికింద్రాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):** వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు విశేష కృషి చేసిన మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం బోయినపల్లిలో బీసీ ప్రజాచైతన్య వేదిక అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెనుకబడిన వర్గాల కోసం పూలే అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. బాణుక మల్లికార్జున్, ఓంప్రకాష్‌యాదవ్, వేణుగోపాల్ ముదిరాజ్, బండిశ్రీనివాస్, బ్రహ్మచారి, మాల్యాద్రి, ముత్యాలు, కృష్ణ, విశ్వరాజ్, దత్తాత్రేయ పాల్గొన్నారు.


పదవీ విరమణ చేసిన గీతను సత్కరిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

## పదవీ విరమణ ఉద్యోగులకు సత్కారం

**చిలకలగూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లో శుక్రవారం 61 మంది ఉద్యోగులు పదవీ విరమణ సందర్భంగా వారికి సత్కరించారు. వారికి రావాల్సిన ప్రావిడెంట్ ఫండ్, గ్రాడ్యూటీ మొదలైనవి వారి బ్యాంక్ ఖాతాలో జమపరిచినట్లు తెలిపే పత్రాలను ఉన్నతాధికారులు అందజేశారు. కార్మిక సంఘ నాయకులు చింతకుంట రామకృష్ణ, షేక్ రవూఫ్‌లు పదవీ విరమణ చేసిన వారికి శాలువాలతో సత్కరించారు.


విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## అప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా?

● బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ నేతల నిలదీత

**పద్మారావునగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):** స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో చిత్తశుద్ధి ఉందని, తమ ప్రయత్నాన్ని తలసాని శ్రీనివాస్ యాదవ్ శంకించాల్సిన అవసరం లేదని బన్సీలాల్‌పేట్ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ...పదేళ్ల బీసీల పొట్ట కొట్టింది 'మీరు కాదా?' అని ప్రశ్నించారు. 'మీ పదేళ్ల పాలనలో గుర్తురాని బీసీలు, అధికారం కోల్పోయాక గుర్తుకు వచ్చారా' అని ఎద్దేవా చేశారు. వారి గురించి మాట్లాడే అర్హత తలసాని శ్రీనివాస్‌కు లేదని విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉండి తలసాని వారికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసి కేంద్రానికి పంపామన్నారు. దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకోలేదని, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ సహకరించలేదని తెలిపారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం సహకరించకపోయినా బీసీలకు పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఆపార్టీ నాయకులకు నచ్చడం లేదన్నారు. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి చేయకపోగా బీఆర్ఎస్ నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. వాళ్ల సోషల్ మీడియా, పేపర్లు టీవీలను అడ్డం పెట్టుకుని అబద్ధాలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ నాయకులు ఎక్కడ ధర్నాకు దిగుతారో చెప్పాలని, మేము అక్కడకే వచ్చి బీసీలకు ఏం చేసామో వివరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొయ్యేటి రాజశేఖరరావు, కృష్ణముదిరాజ్, రామ్‌లక్ష్మణ్, శ్రవణ్, మహేష్, సునీల్, శివ, మధు, వీరన్, భాగ్యమ్మ, దినేశ్‌లు తదితరులు పాల్గొన్నారు.